కథానిక

# బాబు చేసిన వైద్యం

"గోపి"

డాక్టర్ రమేష్ కొడుకు కుమార్. పదేండ్ల వయస్సు. దత్తుకూతురు రాణి; ఎనిమిదేండ్లు. పిల్లలకోసం క్రొత్తగా తెరిచిన పార్కుకి ఒకవైపు రమేష్ బంగాళా, రెండోవైపు కాందిశీకుల కోలనీ ఉన్నాయి. మిల్లుకి త్రోవలో, కోలనీకి కొంచెం దూరంగా దత్తు దుకాణం, ఇల్లు. (అన్నీ అదే)

కాన్వెంటునుండి కార్లోవచ్చేసి, మూతి కాల్చుకుంటూ గబగబా ఒక కప్పు ఓవల్టిన్ త్రాగేసి, ఆట దుస్తులు తొడుక్కుని మూడుచక్రాల సైకిలు మీద పార్కు చేరుకున్నాడు కుమార్. రెండో ప్రక్కనుంచి తాపీగా వస్తూంది రాణి. కుమార్ సైకిలు వదిలేసి, రెండు అణాలుతీసి ఒకదానిమీది కింకొకటి విసురుతూ ముందుకు సాగిపోతున్నాడు. అణా కాసు దొర్లిపోయి పరధ్యానంగా ఉన్న రాణీ పాదాక్రింద పడింది. కుమార్ తనవైపు రావడం చూచి ఆదేశమయంలో ఆగింది రాణి.

"కాలు తీయ్" అని గద్దించాడు కుమార్.

"ఊహూ." అంది వెర్రిపిల్ల రాణి.

ఫెడీమని లెంపకాయ దురుసుగా కొట్టాడు కుమార్. బొటబొట కన్నీళ్లుకారాయి రాణి అమాయకపు లేత కళ్ళల్లోంచి. కాలు కదిపి, క్రింద అణా కాసు చూసి బిస్తుపోయి చేత్తోతీసి కుమార్ కందిచ్చింది.

నిముషం అలాగే రాణిని పరిశీలనగా చూచి చొక్కా చివరతో రాణి కన్నులుతుడిచేసి కుమార్ తన ఖాళీగా ఉండిపోతూన్న ట్రైసికల్ రిక్షా సీటులో బలవంతాన్న కూర్చోపెట్టాడు.

"పేరు?" అడిగాడు కుమార్.

"రాణీ, కాని నాన్నలాగే 'మున్నీ'అని పిలూ" అని చెప్పింది.

"నాపేరు కుమార్, కాని అమ్మలాగే 'బాబూ' అని పిలూ"అని చెప్పేశాడు రాణి తనను అడిగినట్లే భావించి.

"నేస్తం కట్టుకుందామా?" అడిగాడు కుమార్.

"అంటే?" అంది రాణీ తెల్లపోయి.

"ఈ బేడపెట్టి పకోడీలు, బూందీ కొనుక్కొని ఝూలాలో కూర్చొని తింటాం. తరువాత నువ్వూ నేనూ జట్టు." ఆకలిగా ఉంది రాణీకి, "బలేగా ఉందే" అని బాబు భుజంమీద చెయ్యివేసింది స్నేహంగా.

• • •

ఇదై ఆర్నెల్లు వెళ్లాయి. కాని బాబు, మున్నీలు రోజూ ఝూలాలో కలుసుకోవడం ఆడుకోవడం ఎప్పుడూ మానలేదు. గేటుదగ్గరనుంచే రాగయుక్తంగా "రా...ణీ" అంటాడు. (మున్నీ నచ్చలేదు కుమార్కి.)

'బాబూ"అని ప్రతిధ్వనిస్తుంది చలనంలేకుండా ఝూలాలో కూర్చున్న రాణి గొంతుక. దురుసుగా ఒక్క పరుగులోవచ్చి, ఝూలాను ఒక్క ఊపుఊపి, గంతులేసి రాణిప్రక్కకి చేరి చేత్తో నడుం చుడతాడు. ఇహ సాయంకాలంవరకూ వాళ్ళదే రాజ్యం! ఆటలు పాటలు, అన్నీని. చీకటి పడగానే ఎవరిళ్ళ వాళ్ళు చేరుకుంటారు. మర్నాటి సాయంత్రంవరకూ ఎవరికెవరో!

ఆవాళ 'రాణీ' అన్న పిలుపుకి దూరాన్న కొండలు నీరసంగా ప్రతిధ్వనించాయి. ఝూలా ఖాళీ. కుమార్ ఝూలా చేరుకున్నాడు. కూర్చొని గేటువైపు చూస్తున్నాడు. దృష్టిమాత్రం ఎక్కడో ఉంది. వెనుకనుండి మెల్లిగా రాణివచ్చి కుమార్ కళ్లు మూసింది.

"ఫో, నీ జట్టులేను" అన్నాడు కుమార్ కోపంగా.

ప్రక్కనే కూర్చుంది రాణి. "ఎంత తలకాయ నొప్పి వచ్చిందనుకున్నావ్ బాబూ!"అని బారలు చాచింది కొలతగా.

"ఎక్కడ?" అడిగాడు కుమార్.

"ఇక్కడ" అని తల వంచి చూపించింది. జడ పుచ్చుకున్నాడు కుమార్.

"ఒదులు బాబూ!" అని గునిసింది బాధగా.

"పోయిందా?"

"పోందే! పోతుందేమో అనే ఆగాను."

"సరే! మా యింటికి రా. నాన్నతో చెప్పి ఒక మాత్ర వేయిస్తే తక్కున కట్టేస్తుంది" అని చిటిక వేశాడు.

"నాకు భయం బాబూ!"

"ఓస్! చాచాని కూడా తీసుకురా" అంటూ రాణిని ఝూలా దింపి ట్రైసికిల్ మీద కూర్చోబెట్టి "ఎటు?" అని అడిగాడు. దారి చూపింది రాణి.

* * *

కారు ఆపమని బాబు చెయ్యెత్తాడు. పనిమీద ఊళ్ళోకి పోతూన్న రమేష్ కారాపి, "ఏం?" అని అడిగాడు. "నాన్నా! రాణికీ, పెద్ద తలనొప్పి వచ్చిందట మందివ్వు" అన్నాడు కుమార్. "అడ్డమైనవాళ్ళకీ మందులు కావాలి. ఇదేం ధర్మాసుపత్రి కాదు" అంటూ బర్రున లాగించేశాడు కారు. బాబు బిక్కమొహం వేసుకొని ఇంట్లోకి వెళ్ళిపోయాడు.

* * *

మర్నాడు "రాణీ" అంటూ దత్తు ఇల్లుచేరాడు. కుమార్. దత్తు తన కిరాణా దుకాణంలో కూర్చున్నాడు. (లాహోర్ హిందూ-ముస్లిమ్ కొట్లాటల్లో కత్తులు మెరిశాయి. రాణి తల్లిని చూస్తూండగానే నరికారు. అప్పటినుంచీ దత్తుకి మతిపోయింది ఎలా వచ్చాడో హిందూ దేశానికి మతిమాలిన దత్తు.) నుక్కమంచంలో మూలుగుతోంది రాణి. బాబు మంచంమీద కూర్చొని జేబులో చెయ్యిపెట్టి పొట్లంలో మాత్ర పైకితీశాడు.

"నీ జట్టు లేను ఫో!" అని కసిరింది రాణి. అది వినిపించుకోకండా కుమార్ "ఏం తెచ్చానో" అని కాగితం పొట్లాంలోంచి మాత్ర బయటికి లాగాడు, చోద్యంలా.

"ఎందుకూ?" అడిగింది రాణి.

"తల్నొప్పికి" అన్నాడు తలనొప్పి అభినయిస్తూ.

"ఎక్కడిదీ?" అడిగింది ఆశ్చర్యంగా పాతవన్నీ పరగడుపుకు రాగా.

"అదీ! అలా అడుగు చెబుతా. పొద్దున్నే లేస్తూనే తల చేత్తో పుచ్చుకుని 'హమ్మోయ్! బాబోయ్! తలకాయనొప్పి' అన్నా. వెంటనే నాన్న మాత్ర ఇచ్చాడు. స్కూలు కెళ్ళద్దన్నారు. ఇంకేం, పట్టుకొచ్చా నీకోసం. ఇప్పుడో" అని వెలుగుతూన్న కళ్ళతో అడిగాడు బాబు.

"అయ్యో! తలనొప్పి పోయింది బాబూ, పోనీలే, ఉష్ణం ఉంది. మాత్రివ్వు వేసుకుంటా" అంది జాలిగా.

"కొంచెం కూడా లేదా తల్నొప్పి?" అడిగాడు ఆత్రుతగా-

"ఊహూ" తల ఊపింది లేదని.

బాబు సీరియస్‌గా ముఖంపెట్టి, గుండెమీద చెయ్యి వేసి చూచాడు.

"అబ్బ! కాలిపోతూంది రాణీ, నీ వొళ్ళు. అబ్బే ఈ మందు పనికిరాదు. ఇంకోటివ్వాలి. "విరేచనమైందా?" అడిగాడు డాక్టరులాగే.

"ఆ! కొంచెం ఐంది."

"కొంచెం అంటే?"

"కొంచెం! కొంచెం తెలీదూ?"

"ఆ సరే! నిద్దర పట్టిందా?"

"బాబూ! నాన్నకే నిద్దరపట్టలేదుట రాత్రల్లా!"

'నాన్నకి కాదు నీకు."

"అదే నాన్నకి..."

"ఏదీ!" అంటూ కన్ను రెప్ప లాడదీసి "ప్చ్ రక్తంలేదు బొత్తిగా!" అన్నాడు కుమార్ పెదవి విరిచి.

"అదెలా తెలిసిందీ?" అడిగింది ఆశ్చర్యంగా.

"చూడు" అంటూ తన చిటికన వేలుతో ఆమె కనురెప్పలూడదీసి చూపించాడు.

"అబ్బ! నువ్వు ఎప్పుడూ ఇంతే" అని కళ్ళు రాణీ రుద్దుకుంది బాధతో. "అలా కాదు" అంటూ చొక్కా కొసలు చుట్టి, ఆవిరిపెట్టాడు. "ఇంకా బోలెడు పనుంది సాయంకాలం మందు తెస్తా ఇక్కడే పడుకో?" అంటూ తుఱ్ఱున పారిపోయాడు, ఇంటివైపు.

"భలే డాక్టరువే!" అంటూ నవ్వింది రాణి.

సాయంకాలం చొక్కాలోంచి చిన్న మందు సీసా, మాత్రల పొట్లాం తీస్తూ, అడిగాడు ఆత్రుతగా

కుమార్ "ఉష్ణంకూడా పోలేదు కదా!' అని. "అబ్బే! పోతే, ఇంకావుంది కావల్సినంత" అని జవాబు చెప్పింది గర్వంగా! విజయవంతంగా ప్రారంభించాడు కుమార్, "ఇక్కడినుంచి ఇంటికెళ్ళి ఉష్ణం వచ్చిందని చెప్పాను. అమ్మ నమ్మేసింది. నాన్న థర్మామీటరు పెట్టి చూచాడు. ఉష్ణం లేదు గిష్ణం లేదు. ఎండలో తిరగడాన్నలావుంది అని హాస్పిటల్‌లో కూర్చోపెట్టాడు. ఎలారా మందు రాణీకి అని ఆలోచిస్తున్నా."

"థర్మామీటరంటే?" అడిగింది రాణి మాటలు దొర్లించుకుపోతున్న కుమార్‌ని ఆపి.

"థర్మామీటరు తెలీదూ? చిన్నపిల్లవి! భలే! గాజుపుల్లలా వుంటుంది. చూపిస్తాలే! కానీ ఇంతలో ఒకాయన కారేసుకొచ్చాడు. 'పిల్ల కుష్ణం 'అన్నాడు. 'వయస్సు?' అడిగాడు నాన్న 'ఎనిమిది' అన్నాడు కారాయన. "భేష్!" అనుకున్నా నేను. సింగు మందు కలుపుతున్నంతసేపూ చూచాను."

'సింగెవరూ?"

"సింగు తెలీదూ? కంపౌండరు. మందు సిద్ధంగా ఉంచాడు సింగు. 'నాన్న పిలుస్తున్నాడని'చెప్పాను. సింగు కదల్నిచ్చి మందు దాచేశా! ఇప్పుడే మంటావ్!" అన్నాడు కుమార్.

"మరి పోల్చుకోడూ?"

"సింగు ముసలాడు భయం లేదులే" అని మాత్ర నోట్లోకుక్కి మందుపోశాడు. ఇద్దరూ నవ్వుకున్నారు. పంట్లాం జేబులోంచి విసిల్ తీసి "రాణీ, ఉష్ణంలో పాలు, పళ్లు తీసుకోవాలి. ఇదిగో విసిల్, ఇవాళికి, రేపు మళ్ళా తెస్తా!" అని పనున్న వాడిలా మళ్ళా ఇల్లు చేరుకున్నాడు.

* * *

మర్నాడు బడినుంచి వచ్చాక బాబుకి "రాణీకి మందెల్లాగా"అన్న ప్రశ్న వచ్చింది. కారు పెద్ద మనిషి మళ్ళీ వచ్చాడు. బాబు ముఖం చింకిచేటంతైంది. చెవులు నిక్కపెట్టి వింటున్నాడు. మళ్ళా మందు మార్చారు. హాకసీసాలో మందొంపుకొని, మాత్రలు పాకెట్‌లోకుక్కి, మజాగా ఏమార్చాడు సింగుని. విసిల్స్ పేటులోకుక్కి ట్రైసికిల్ మీద పార్కుదాటుతూ ఝూలాదగ్గర కెళ్ళాడు. సెలవు చీటీ పెట్టినట్లు'రాణికి ఉష్ణంపోతే మళ్ళా వస్తాంలే!' అని చెప్పి, రాణిదగ్గరకి బయలు దేరాడు.

మర్నాడు కుమార్ ఆఫీసు టేబిలుమీదనుంచి థర్మామీటరు కూడా జేబులోకి మాయంచేశాడు. రోజుకిరోజూ మందుకి క్రొత్త కన్నాగాలు వెయ్యాల్సొస్తున్నది కుమార్‌కి. స్టెతస్కోపు మీదకూడా కన్నుంది. కాని ఎలాగ? పాతది కనబడుతుందేమో అని చాలా వెతికాడు.

అక్కడ రాణీ యింట్లో మిరియాలు సొంఠికషాయంతో వైద్యంచేస్తున్నాడు దత్తు. అసలు మతిలేదు మనిషికి ఏంచెయ్యడానికీని!

"రాణీ! ఇదిగో థర్మామీటరు!"అని తొందరగా నోట్లోకుక్కి "నాలిక్కింద పెట్టుకో" అని ఆజ్ఞాపించాడు. చేత్తో రాణి చెయ్యిపట్టుకుని, లేని వాచీ చూస్తున్నాడు. థర్మామీటరు తీసి చూచాడు.

"ఏం తెలుస్తుంది బాబూ?" అడిగింది రాణి నీరసంగా.

"ఉష్ణం" అన్నాడు అనుమానంగా.

"ఎలాగ?"

"అదే చూస్తున్నా! ఇది నోట్లోపెట్టి చెయ్యిపట్టుకుని వాచీచూసి చెప్తాడు నాన్న. ఆఁ, చాచాకి తెలుసునేమో వుండు" అని దత్తుని పిలిచి చూపించాడు.

దత్తు థర్మామీటరు చూచి 'నూటనాలుగు అని చతికిలపడి పోయాడు. గబగబా ఒకమాత్ర, మందూ రాణీకి పట్టేశాడు కుమార్.

* * *

నిజంగానే ఆ రాత్రి తలకాయనొప్పి ప్రారంభించింది బాబుకి. ఇంట్లో చెప్పగానే కుమార్ తల్లి బాబుని తడిమి, "అబ్బా! ఇటుచూడండీ! బాబుకి ఉష్ణం వచ్చిందండీ!" అని హాహాకారాలు చేసింది. "చెబుతూనే ఉన్నా లోపలుందని" అని గొణిగాడు కుమార్.

వెంటనే మంచంవేసి పండుకో బెట్టారు. హాస్పిటల్ నుంచి ముసలినర్సుని తెచ్చారు. బాబుకి అర్థంకాలేదు యీ గొడవంతా! రాణికి జ్వరం వస్తే-తన రాణికి-ఎవరూ ఏమీ చెయ్యలేదు. తన కొస్తే ఎందుకో ఇంతగొడవ అనుకున్నాడు. అంత తలనొప్పిలోనీకూడా మర్నాటి నుంచీ మందు

దొంగలాడక్కరలేదు అని చాలా ఉత్సాహంగా ఉన్నాడు. "థర్మామీటరు కనపడదేం?" అన్న రమేష్ గొంతుక విని ఏమీ ఎరగని వాడిలా కళ్ళు మూసుకున్నాడు బద్ధకంగా.

మర్నాడు మందు జాగ్రత్త చేశాడు. కాపలాతో వచ్చింది గొడవ. పన్నెండు గంటలు కొట్టారు. మబ్బుగా ఉంది. అంతా భోజనాలు చేస్తున్నారు. ముసలి నర్సు కునుకుతూంది. చడీచప్పుడూ లేకుండా మందూ పళ్ళూ తీసుకొని రాణిదగ్గరకి దారితీశాడు.

"నాకూ బలేగా వచ్చిందిలే ఉష్ణం" అన్నాడు గర్వంగా.

"హయ్యో ఎలావచ్చావ్ మరి?" అని హీన స్వరంతో బల్లిలా మంచంపట్టిన రాణి అడిగింది.

"ఈ మందు తాగు; పళ్లు తిను. ఆలస్యం చేస్తే ఆ నర్సొచ్చేస్తుంది" అని తిరిగి జాగ్రత్తగా వచ్చేశాడు ఎప్పటిలాగే.

* * *

రెండు రోజులు ఎక్కడా కాపలా వదల్లేదు కుమార్‌కి. రమేష్ మరో డాక్టర్ని కూడా పిలిచాడు. "టైఫాయిడేమోనోయ్ రమేష్!" అన్నాడా కొత్తాయన. అంతా గాభరా పడ్డారు. రమేష్ కంపౌండర్ని పిలిచి, 'ఎందుకన్నా మంచిది ఈ కొత్తమందు బజార్నుంచి తీసుకురా!" అని పంపాడు కారుమీద ..మందు వచ్చింది. అది అల్మారాలో ఎదురుగుండా పెట్టారు. అది ఇంటి దగ్గరకూడా లేదంటే ఎంతో మంచిమందై ఉండాలని రాణికి ఆ మందిచ్చేస్తే క్షణాల్లో తగ్గిపోతుందనీ గొప్ప నమ్మకం ఏర్పడింది కుమార్‌కి. పరీక్షకి రక్తం, మలం, మూత్రం అన్నీ తీసుకెళ్ళారు. మరి రాణినెలా పరీక్ష చేయించడం? చివరకి సైతాస్కోపుకూడా దొరకలేదే! అని ఆలోచిస్తున్నాడు బాబు. పదిగంటలు కొట్టారు. అంతా భోజనాలకి వెళ్ళారు. దాహం వేసింది కుమార్‌కి. "దాహం" అన్నాడు. "పండ్లరసం త్రాగు" అని చెప్పింది నర్సు. సరే అన్నాడు పండ్లరసం తీసేచట్రం వంటింట్లో ఉంది. నర్సు దానికోసం వెళ్ళింది. "ఇదే సమయం" అని ఆ కొత్త మాత్రల సీసా, పళ్ళు, పుచ్చుకొని, కిటికీ దూకి బయలుదేరాడు రాణిదగ్గరకి, గుడ్డి వెన్నెలలో.

దత్తు హాస్పటల్‌కి వెళ్ళి మందు తెచ్చాడు. అవాళ 'బాబు తెస్తాడు మందు, నే త్రాగనం' టోందిరాణి. దత్తు అలాగే రాణివంక మతిమాలి చూస్తున్నాడు. బాబు అక్కడికి చేరాడు ఒగరుస్తూ! ఉష్ణంతో! అదే సమయంలో!

కుమార్ కనపడకపోగానే, ఇంటిదగ్గర హాహాకారాలు చలరేగాయి. అందరూ నాలుగు వైపులా వెళ్ళారు. దాంట్లో రమేష్, దత్తుదుకాణం దగ్గర బాబు మాటలువిని ఆగి లోపలికొచ్చి చూచాడు. వారం రోజులనుండీ బాబు విచిత్ర ప్రవర్తన, ఆత్రుత, తిండి తినకపోడం పళ్లు అవి దాచుకుంటానడం, థర్మామీటరు మాయంకావటం 'రాణికి మందివ్వు' అని కలవరించడం—వీటన్నిటినీ అర్థం చేసుకున్నాడు, రమేష్ ఆ క్షణంలో.

బాబుని భుజంమీద వేసుకొని రాణిని కూడా తీసుకు రమ్మని దత్తు నాజ్ఞాపించాడు రమేష్.

ఇద్దరికీ ఒకే గదిలో రెండు పక్కలూ వేసి పండుకో పెట్టి వైద్యం ప్రారంభించేడు. రోజూ దత్తు వచ్చి చూసిపోతూండేవాడు. కాని ఒక రోజున రాలేదు. రమేష్ వెళ్ళి చూస్తే, ఏముందీ దత్తు ఆ క్రితం రాత్రి చనిపోయి మంచంమీదే ఉన్నాడు.

* * *

నెల గడిచింది. ఇద్దరు పిల్లలూ ఆరోగ్యంగా తిరుగాడడం మొదలు పెట్టారు. వేసవి తరువాత బడులు తెరిచారు. ఇద్దర్నీ చదువులో పెట్టాడు రమేష్. ఇప్పుడు రాణీకి గార్డియన్, బాబు. చీమ చిటుక్కుమంటే రాణీకి భయమే, బాబు వైద్యం ప్రారంభిస్తాడని. "బాబూ! నువ్వు డాక్టర్ పాసై మందిద్దూగాని అందాకా నన్నివ్వనీ" అన్న రమేష్‌కి కినుకగా "ముందిమ్మంటే ఎందుకిచ్చావు కావుమరి?" అని అడుగుతాడు బాబు. "బాబుచేసిన వైద్యం" కథలా చెబుతుంది రాణి. "నువ్వుకూడా నాతో పాటు డాక్టర్ చదువుదూ గానిలే రాణీ" అంటే "నాకొద్దు బాబూ, కత్తులూ కటార్లూ, సూదులు. మందులూ అన్నీ నీకే" అంటుంది రాణీ.

ఈ సంఘటనతో రమేష్‌లో చాలా మార్పు వచ్చింది. ఇప్పుడు తన సైన్‌బోర్డుమీదే 'పేదలకి ఉచితం' అనే మాటలు వ్రాయించాడు. ★